# సాక్షి
## భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 30 । జూలై । 2023






**వరద బాధితులకు పరామర్శ**

భారీ వర్షాలు, వరదలతో ఇల్లెందులో ఇళ్లు, గోడలు కూలిన బాధితులను ఎంపీ మాలోత్ కవిత శనివారం పరామర్శించారు. 8లో



**భక్తిశ్రద్ధలతో మొహర్రం**

జిల్లా వ్యాప్తంగా ముస్లింలు మొహర్రం పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పీరీలను ఊరేగిస్తూ మృతవీరులను స్మరించుకున్నారు. 9లో


గరిష్టం / కనిష్టం
31° / 25°

**వాతావరణం**

జిల్లాలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

**భద్రాచలం:** భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువు దీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### పెద్దమ్మతల్లిని దర్శించుకున్న ఖమ్మం జిల్లా జడ్జి



అమ్మవారి సన్నిధిలో జడ్జి జగ్జీవన్‌కుమార్

**పాల్వంచరూరల్:** మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారిని ఖమ్మం జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి బి.ఎస్.జగ్జీవన్‌కుమార్ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జడ్జికి అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలు అందజేశారు.

### ముంపు బాధితులకు మెరుగైన సౌకర్యాలు



నిర్వాసితులతో మాట్లాడుతున్న రాంబాబు

**భద్రాచలంటౌన్:** భద్రాచలంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో వసతి పొందుతున్న ముంపు బాధితులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు అదనపు కలెక్టర్ రాంబాబు తెలిపారు. పట్టణంలోని డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. వరదలు పూర్తిగా తగ్గి పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చేంత వరకు పునరావాస కేంద్రాల్లోనే ఉండాలని ముంపు బాధితులకు సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**మంత్రిని కలిసిన అదనపు కలెక్టర్**

**బూర్గంపాడు :** ఇటీవల అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పర్సా రాంబాబు శనివారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

### కేయూ పరిధిలో పరీక్షలు వాయిదా

**కేయూ క్యాంపస్:** కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఆది, సోమవారాలతో పాటు ఆగస్టు 1, 2వ తేదీల్లో జరగాల్సిన పరీక్షలను వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి వెల్లడించారు. భారీ వర్షాలతో పలు మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయిన నేపథ్యాన ఈ నిర్ణయం తీసుకున్నాట్లుతెలిపారు. బీ ఫార్మసీ, ఫార్మా డీ, బీఏ, బీకాం, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ సెమిస్టర్ పరీక్షలే కాకుండా పీజీ కోర్సుల నాలుగో సెమిస్టర్ ప్రాక్టికల్ పరీక్షలు, లా చివరి సంవత్సరం విద్యార్థులకు మూట్ కోర్టు పరీక్షలు వాయిదా వేశామని పేర్కొన్నారు. ఆయా పరీక్షలు మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

### 1న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

**కొత్తగూడెంటౌన్:** జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను ఆగస్టు 1న నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దమ్మపేటలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఆవరణలో జావెలిన్, 100, 400 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించి ఎంపిక చేస్తామని వివరించారు.

# ఇంకా ఉత్కంఠే..

**భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి నీటిమట్టం**

- ఎగువ నుంచి 13లక్షల క్యూసెక్కుల వరద
- రాత్రి 12 గంటలకు 56.10 అడుగుల నీటిమట్టం
- కొనసాగుతున్న సహాయక శిబిరాలు
- అప్రమత్తంగా అధికార యంత్రాంగం



భద్రాచలం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

**భద్రాచలం :** గోదావరి నదికి వరద ప్రవాహం పెరుగుతుండడంతో తీర ప్రాంత వాసుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. స్థానికంగా వర్షాలు తగ్గినా ఎగువ నుంచి వరద వస్తుండడంతో గోదావరి శాంతించడం లేదు. అయితే అంతే స్థాయిలో వరద దిగువకు వెళుతుండడంతో భద్రాచలం వద్ద నీటిమట్టం నెమ్మదిగా పెరుగుతోంది. వరద తీవ్రత, తీసుకోవాల్సిన చర్యల గురించి రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కలెక్టర్ ప్రియాంక ఆల ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. ఐఏఎస్ అధికారి దురిశెట్టి అనుదీప్, ఎస్పీ డాక్టర్ జి.వినీత్, ఏఎస్పీ పరితోశ్ పంకజ్, ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ తదితరులు సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

**నేడూ వరద పోటు..**

శనివారం రాత్రి 12 గంటల సమయంలో భద్రాచలం వద్ద గోదావరి 15,96,899 క్యూసెక్యుల నీటి ప్రవాహం దిగువకు వెళుతుండగా నీటి మట్టం 56.10 అడుగులుగా ఉంది. గోదావరికి ఎగువ ప్రాంతాన ఉన్న సమ్మక్క బ్యారేజీ వద్ద నీటిమట్టం శనివారం రాత్రి 9 గంటలకు 13 లక్షల క్యూసెక్కులుగా నమోదైంది. సమ్మక్క బ్యారేజీ భద్రాచలనికి ఎగువన 100 కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడ శనివారం మధ్యాహ్నం వదిలిన గరిష్ట వరద భద్రాచలం చేరేందుకు 24 గంటల సమయం పడుతుంది. దీంతో ఆదివారం మధ్యాహ్నం వరకు వరద పోటు కొనసాగే అవకాశం ఉంది. గరిష్ట వరద భద్రాచలం చేరుకునే సమయానికి నీటి మట్టం 60 అడుగుల వరకు చేరుకోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆదివారం సాయంత్రానికి భద్రాచలం దగ్గర నీటి మట్టం 53 అడుగుల దిగువకు తగ్గి, ఎగువ నుంచి వరద రాకుంటే పునరావాస శిబిరాల నుంచి ఇళ్లకు వెళ్లేందుకు ముంపు బాధితులకు అనుమతి ఇస్తామని అధికారులు చెబుతున్నారు.

### కొనసాగుతున్న సహాయక చర్యలు

గోదావరి వరద నీటిమట్టం 60 అడుగుల వరకు చేరుకుంటుందనే అంచనాతో అధికారులు తీర ప్రాంతంలో ఉన్న చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం, అశ్వాపురం, మణుగూరు, బూర్గంపాడు మండలాల్లో సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. సుమారు 45 గ్రామాలకు చెందిన 10 వేల మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. అయితే భద్రాచలంలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాల్లో సమయానికి ఆహారం అందించడంలో అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం రాత్రి 10.30 గంటలకు ఆహారం అందించగా, శనివారం మధ్యాహ్నం 2 గంటల వరకు కూడా సరఫరా చేయకపోవడంతో బాధితులు పునరావాస కేంద్రాల వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.



భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల పునరావాస కేంద్రంలో బాధితులు

# అన్నం కోసం ఆందోళన

- మధ్యాహం 2 గంటల వరకూ పెట్టకపోవడంతో ధర్నా
- చిన్న పిల్లలు ఆకలితో అలమటిస్తున్నారని ఆవేదన
- ఆర్డీఓ చొరవతో 3 గంటలకు భోజనం



ఆహారం కోసం తోపులాడుకుంటున్న ముంపువాసులు

**భద్రాచలంటౌన్:** గోదావరి ముంపు పేరుతో ఇళ్ల నుంచి బలవంతంగా తీసుకొచ్చిన అధికారులు ఆకలితో చంపుతున్నారని, 'ఒక్క ముద్ద బువ్వ పెట్టండి' అంటూ పునరావాస కేంద్రాల్లోని బాధితులు గంటకు పైగా ఆందోళన చేశారు. రెండు రోజులుగా పునరావాస కేంద్రాల్లో ఉంటున్న తమను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మొదటి రోజు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు, రాత్రి 11 గంటలకు భోజనం పెట్టగా, రెండో రోజు శనివారం మధ్యాహ్నం 2 గంటల వరకు కూడా ఆహారం అందించలేదని అన్నారు. దీంతో చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆర్డీఓ కార్యాలయానికి చెందిన ఓ ఉద్యోగే దీనికి కారణమని వారు ఆరోపిస్తున్నారు. గతేడాదిలా కాకుండా ఎక్కడో వండించి పునరావాస కేంద్రాలకు తీసుకురావడం వల్లే ఆలస్యం అవుతోందన్నారు.

**ఆర్డీఓ చొరవతో ఆందోళన విరమణ..**

ఆందోళన విషయం తెలుసుకుని పునరావాస కేంద్రం వద్దకు చేరుకున్న ఆర్డీఓ మాధవి బాధితులతో మాట్లాడారు. సమయానికి భోజనం అందకపోవడం బాధాకరమన్న మాధవి.. అక్కడి నుంచే అధికారులు ఫోన్ చేసి వెంటనే భోజనం అందజేయాలని ఆదేశించారు. భోజనం వచ్చేవరకు అక్కడే ఉండి బాధితులకు వడ్డించారు. మూడు గంటల పాటు వేచి ఉన్న బాధితులు భోజనం రావడంతోనే ఒక్కసారిగా వడ్డించే వారిపై పడ్డారు. దీంతో కొంత తోపులాట జరిగింది. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చూస్తానని ఆర్డీఓ తెలిపారు.

### పిల్లలకు బిస్కెట్లు కొనిస్తున్నాం



పిల్లలకు సమయానికి ఆహారం పెట్టకపోవడంతో బిస్కెట్లు కొనిస్తున్నాం. ఈ మాత్రం దానికి మమ్మల్ని ఇక్కడ ఉంచడం ఎందుకు.. ఇళ్లకు పంపిస్తే వెళ్తాం. ఇంట్లో ఒక్క వస్తువు లేకుండా ఖాళీచేసి ఇక్కడి వచ్చాం. అధికారులు పట్టించుకోవాలి.

– సుధ, బాధితురాలు

### ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం



ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితోనే పునరావాస కేంద్రాల్లోని బాధితులు రోడ్డెక్కే పరిస్థితి వచ్చింది. జిల్లా మంత్రి పర్యటిస్తున్న సమయంలోనే ఇలాంటి ఘటన జరిగిందంటే ప్రభుత్వానికి ప్రజల పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోంది.

– పొదెం వీరయ్య, ఎమ్మెల్యే

# పులుల పునరాగమనానికి కృషి చేయాలి

**జిల్లా అటవీశాఖ అధికారి కిష్టాగౌడ్**



సెంట్రల్ పార్క్‌లో మొక్క నాటుతున్న డీఎఫ్ఓ కిష్టాగౌడ్, అధికారులు

**చుంచుపల్లి/పాల్వంచరూరల్ :** జిల్లా అడవుల్లో పులుల పునరాగమనానికి ప్రతి ఒక్కరూ పరితపించాలని జిల్లా అటవీ శాఖ అధికారి కిష్టాగౌడ్ అధికారులు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. అంతర్జాతీయ పులుల దినోత్సవ సందర్భంగా కొత్తగూడెంలోని సీఎస్సార్ సెంట్రల్ పార్క్, పాల్వంచలో శనివారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. వచ్చే ఐదేళ్లలో ఈ ప్రాంత అడవులు పులలతో కళకళలాడేలా చర్యలు చేపట్టాలన్నారు. అడవుల ఆక్రమణను అడ్డుకోవాలని, వన్యప్రాణుల వేటను అరికట్టాలని అన్నారు. దట్టమైన అటవీ ప్రాంతాల్లో గడ్డిమైదానాలు, నీటి కుంటలు ఏర్పాటు చేయాలన్నారు. వన్యప్రాణుల వేటగాళ్లకు కఠిన శిక్షలు పడేలా చూడాలని సూచించారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి తెలంగాణకు ఇప్పటికే పులుల రాక ప్రారంభమైందని, వాటిని కంటికి రెప్పలా కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు. జిల్లా అడవుల్లో వివిధ రకాల వన్యప్రాణులు పుష్కలంగా ఉన్నా పులులు లేకపోవడం బాధాకరమని అన్నారు. పులులు సంచరిస్తే అడవులకు స్మగ్లర్ల బెడద ఉండదని చెప్పారు. ఇరత రాష్ట్రాల్లోని అడవులు చిన్నగా ఉన్నప్పటికీ.. అక్కడ పులులు ఉన్నాయని, జిల్లాలో విస్తారంగా అటవీ ప్రాంతం ఉన్నా పులులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో పులులు మనుగడ సాగించేవరకు తాను నిద్రపోను, సిబ్బందిని నిద్రపోనివ్వను అని స్పష్టం చేశారు. అనంతరం అటవీ సిబ్బందితో కలిసి సెంట్రల్ పార్క్‌లో మొక్కలు నాటారు. పాల్వంచలోని వైల్డ్‌లైఫ్ డివిజన్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ కట్టా దామోదర్‌రెడ్డి, కొత్తగూడెం ఎఫ్‌డీఓ అప్పయ్య, ఎఫ్ఆర్‌ఓలు సురేష్, ఉమ, ముక్తార్ అహ్మద్, ప్రసాదరావు, రేంజర్లు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ఆర్టీసీకి కొనసాగుతున్న నష్టాలు

**ఖమ్మం మామిళ్లగూడెం:** వరుస వర్షాలతో వరద ముంపునకు గురైన ప్రాంతాలకు ఆర్టీసీ మూడు రోజులుగా సర్వీసులు రద్దు చేస్తోంది. ఈమేరకు శనివారం ఖమ్మం ఆర్టీసీ రీజియన్ పరిధిలోని పలు సర్వీసులు రద్దు చేయగా రూ.7లక్షల నష్టం వాటిల్లింది. రోజూ రావాల్సిన రూ.95లక్షల ఆదాయానికి బదులు రూ.88 లక్షల ఆదాయం సమకూరింది. రీజియన్‌లోని ఆరు డిపోలకు సంబంధించి భద్రాచలం నుంచి ఇరవై సర్వీసులు, ఖమ్మం నుంచి ఆరు, మణుగూరు నుంచి ఐదు, సత్తుపల్లి నుంచి నాలుగు, కొత్తగూడెం నుంచి మూడు, మధిర డిపో నుంచి ముంపు ప్రాంతాలకు వెళ్లాల్సిన రెండు సర్వీసులను రద్దు చేయగా, సుదూర ప్రాంతాలకు యథావిధిగా రాకపోకలు సాగుతున్నాయని అధికారులు తెలిపారు.

### నేడు కిన్నెరసానిలో బోటింగ్ నిలిపివేత

**పాల్వంచరూరల్:** పర్యాటక ప్రాంతమైన కిన్నెరసాని జలాశయంలో ఈ ఆదివారం బోట్ షికారును నిలిపివేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ అధికారుల ఆదేశాలతో ఇక్కడి బోటింగ్ సిబ్బందిని భద్రాచలానికి తరలించారు. దీంతో కిన్నెరసాని బోటింగ్ నిలిపివేసినట్లు పేర్కొన్నారు.

# ప్రజా సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే..

- ప్రకృతి వైపరీత్యాలను రాజకీయం చేయడం తగదు
- అధికారులు 24 గంటలూ పని చేస్తున్నారు
- రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



చర్ల మండలం జీపీపల్లిలో బాధితులతో మాట్లాడుతున్న మంత్రి అజయ్‌కుమార్



భద్రాచలం సమీపంలో అధికారులతో చర్చిస్తున్న మంత్రి పువ్వాడ

**భద్రాచలంటౌన్/చర్ల :** భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి పెరుగుతోందని, ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రజల సంరక్షణ బాధ్యత ప్రభుత్వంపై ఉందని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. భద్రాచలంలోని విస్తా కాంప్లెక్స్, కరకట్ట వద్ద గోదావరి వరద ఉధృతిని ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, మాలోత్ కవిత, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, కలెక్టర్ ప్రియాంక ఆల, వరద సహాయక చర్యల ప్రత్యేక అధికారి అనుదీప్, ఎస్పీ వినీత్‌తో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎగువ ప్రాంతాల నుంచి వరదలు వస్తుండడంతో గోదావరి ప్రవాహం పెరుగుతోందని, జిల్లా అధికారులు 24 గంటలూ అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. ముంపు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే పునరావాస కేంద్రాలకు తరలించినట్లు వివరించారు. విస్తా కాంప్లెక్స్ వద్ద స్లూయిస్ మరమ్మతులు నిర్వహించి, భారీ మోటార్లతో ఎప్పటికప్పుడు మురుగు నీరు తొలగిస్తున్నామని, దీంతో ఆలయ పరిసర ప్రాంతాల్లో చుక్క నీరు లేకుండా పరిశుభ్రం చేశామని చెప్పారు. ప్రకృతి వైపరీతాల్యలను కొందరు రాజకీయం చేస్తున్నారని, ఇది తగదని హితవు పలికారు. అంతకు ముందు ఆయన హెలికాప్టర్ ద్వారా భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు.

**అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం..**

వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ఎవరూ భయపడవద్దని మంత్రి అజయ్‌కుమార్ కోరారు. చర్ల మండలం జీపీపల్లిలో పునరావాస కేంద్రాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడారు. ముంపు బాధితుల పట్ల సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక శ్రద్ధ ఉందని, ఎవరెన్ని కల్లబొల్లి కబుర్లు చెప్పినా నమ్మవద్దని అన్నారు. బాధితులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కాగా, ఈనెల 28 నుంచి మావోయిస్టు పార్టీ వారోత్సవాలు నిర్వహిస్తుండడం, చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో మావోయిస్టుల ప్రాబల్యం ఉండడంతో పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. సీఐ అశోక్ కుమార్ నేతృత్వంలో బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు మంత్రి కాన్వాయ్‌కు ముందు సీఐ బైక్‌పై వెళుతూ భద్రత ఏర్పాట్లు పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వరరెడ్డి, ఈఈలు రాంప్రసాద్, భీమ్లా, చర్ల తహసీల్దార్ భరణిబాబు, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, సెక్టోరియల్ అధికారి సుధాకర్, మండల ప్రత్యేకాధికారి అభిమన్యుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ముంపు

- శాశ్వత పరిష్కారం కల్పించడంలో విఫలం
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- వరద బాధితులకు పరామర్శ



నాటుపడవలో సున్నంబట్టి గ్రామానికి వెళ్తున్న భట్టి విక్రమార్క, పొదెం వీరయ్య

**భద్రాచలంటౌన్/పాల్వంచరూరల్/దుమ్ముగూడెం :** భద్రాద్రి ప్రజలు ప్రతి ఏటా గోదావరి ముంపుతో ఇబ్బంది పడడానికి బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే కారణమని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. శనివారం ఆయన ఎమ్మెల్యే పొదెం వీరయ్యతో కలిసి భద్రాచలం, పాల్వంచ, దుమ్ముగూడెం మండలాల్లో పర్యటించి వరద బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గోదావరి ముంపుతో భద్రాద్రి వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే జిల్లా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వచ్చి కరకట్టను చూసి వెళ్లడం తప్ప శాశ్వత పరిష్కారం కల్పించడంలో విఫలమయ్యారని విమర్శించారు. భద్రాద్రికి కేటాయించిన నిధులతో కరకట్టను అభివృద్ధి చేయాలని స్థానిక ఎమ్మెల్యే కోరినా పట్టించుకునే నాథుడే లేడన్నారు. సీఎం కేసీఆర్ దేశాన్ని ఏలుతానంటూ రాష్ట్రాన్ని గాలికొదిలేశారని ఆరోపించారు. వరదలతో నష్టపోయిన వారికి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కిన్నెరసాని వాగులో నాలుగేళ్ల క్రితమే రూ. 12.74 కోట్లతో చెక్‌డ్యామ్ నిర్మించారని, నాసిరకంగా పనులు చేపట్టడంతో డ్యామ్ కొట్టుకుపోయిందని అన్నారు. నాణ్యత లేని పనులు చేపడుతుండడంతో ప్రజాధనం వృథా అవుతోందని విమర్శించారు. వరద ముంపునకు గురవుతున్న గ్రామాల ప్రజలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందించి మైదాన ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. దుమ్ముగూడెం మండలం నారాయణరావుపేటలో కూలీలతో కలిసి వరినాట్లు వేశారు. ఆయా కార్యక్రమాల్లో టీపీసీసీ ఉపాధ్యక్షుడు పోట్ల నాగేశ్వరరావు, నాయకులు నాగ సీతారాములు, దేవీ ప్రసన్న, బైరెడ్డి సీతారామరావు, లంకా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నిర్వాసితులను ఆదుకోవాలి



నిర్వాసితులతో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

**కొత్తగూడెంరూరల్:** పాత కొత్తగూడెం ఎస్సీ కాలనీ నిర్వాసితులను అన్ని విధాలా ఆదుకోవాలని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రాత్రి ఆయన నిర్వాసితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఇళ్లు కేటాయించగా నేడు అవి శిథిలావస్థకు చేరాయని, దీంతో కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తానని చెప్పి ఏడాది కావస్తున్నా ఇంతవరకూ అమలు కాలేదని విమర్శించారు. అర్హులందరికీ దళిత బంధు సాయంతో పాటు గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు పోట్ల నాగేశ్వరరావు, నాయకులు రాయల నాగేశ్వరరావు, జేబీ శౌరి, మాలోతు రాందాస్‌నాయక్, గరీబ్‌పేట ఎంపీటీసీ కసనబోయిన భద్రం, గడ్డం రాజశేఖర్, అజ్మీర సురేష్‌నాయక్, అల్లాడి నరసింహారావు, ఏలూరి రాందాస్ పాల్గొన్నారు.

# ఇటు భట్టి.. అటు పువ్వాడ..

**ఇరు పార్టీల నాయకుల పర్యటనతో పోలీసుల హైరానా**

**భద్రాచలం:** భద్రాచలంలో శనివారం బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఒకే సమయంలో పర్యటించారు. ఉదయం 11 గంటలకు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, పొదెం వీరయ్య, 12 గంటలకు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కరకట్టపై నుంచి గోదావరి వరదను పరిశీలిస్తారని రెండు పార్టీల నాయకులు షెడ్యూల్ విడుదల చేశారు. అయితే భట్టి విక్రమార్క పర్యటన కొంత ఆలస్యం కాగా 12.30 గంటలకు కరకట్ట, స్లూయిజ్‌ల పరిశీలనకు వచ్చారు. అదే సమయంలో భద్రాచలం వచ్చిన మంత్రి అజయ్‌కుమార్‌కు అధికారులు కాంగ్రెస్ నాయకుల పర్యటన సమాచారం అందించగా ఆయన నేరుగా యటపాక రోడ్డుకు వచ్చారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో దుమ్ముగూడెం, చర్ల మండలాలకు వెళ్లాలనుకున్నారు. అయితే పలు చోట్ల ప్రధాన రహదారిపైకి నీరు రావడంతో తిరిగి ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు వెళ్లి అధికారులతో సమీక్ష జరిపారు. తిరిగి సాయంత్రం 5గంటలకు ఎంపీలు మాలోత్ కవిత, వద్దిరాజు రవిచంద్ర, నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణలతో కలిసి కరకట్టపై నుంచి గోదావరి వరద ఉధృతిని పరిశీలించారు.

## క్లుప్తంగా

### కేటీసీలో పర్యటించిన డైరెక్టర్



ఓసీలో పరిశీలిస్తున్న సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

టేకులపల్లి: మండలంలోని కోయగూడెం ఉపరితలగనిలో సింగరేణి డైరెక్టర్ (పీపీ) జి.వెంకటేశ్వరరెడ్డి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా పని ప్రదేశాలను పరిశీలించిన ఆయన రోజువారి బొగ్గు ఉత్పత్తి, ఓబీ వెలికితీత, రవాణాపై ఆరా తీశారు. వర్షం కారణంగా నిలిచిన ఉత్పత్తిని తిరిగి పునరుద్ధరించి వేగం పెంచాలని సూచించారు. ఇదే సమయాన కార్మికుల రక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్వే అధికారి నరేశ్, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కిన్నెరసాని నీటి విడుదల



ప్రాజెక్ట్ నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు

పాల్వంచరూరల్: ఎగువ నుంచి కిన్నెరసాని జలాశయానికి ఇంకా వరద వస్తూనే ఉంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్‌లోకి 2,770 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, శనివారం నీటిమట్టం 402.60 అడుగులుగా నమోదైంది. దీంతో ప్రాజెక్టుకు చెందిన రెండు గేట్లను ఎత్తి ఉంచి 8 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు ఈఈ వెంకట్‌రెడ్డి తెలిపారు. కిన్నెరసాని పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### పునరావాస కేంద్రంలో సౌకర్యాలపై ఆరా



వరద బాధితులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ విద్యాలత

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో కేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని శనివారం జెడ్పీ సీఈఓ విద్యాలత, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష సందర్శించారు. వరద బాధితులతో మాట్లాడి భోజనం, తదితర సదుపాయాలపై ఆరా తీశారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, జెడ్పీటీసీ సభ్యురాలు సూదిరెడ్డి సులక్షణ, వైస్ ఎంపీపీ వీరభద్రం, ఎంపీడీఓ వరప్రసాద్, తహసీల్దార్ ఎం.ఏ.రాజు, ఏడీఏ తాతారావు, సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### గుర్తుతెలియని మృతదేహం లభ్యం

దుమ్ముగూడెం: మండలంలోని సీతారాంపురం వద్ద గోదావరి ఒడ్డున సుమారు 55 సంవత్సరాలు వయసున్న వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. నాలుగైదు రోజుల క్రితం చనిపోయి ఉండొచ్చని, మృతుడు 5.6 అడుగుల ఎత్తు ఉన్నాడని, సమాచారం కోసం 87126 82115 నంబరులో సంప్రదించాలని సీఐ దోమల రమేష్ తెలిపారు.

### వేధింపుల కేసు నమోదు

భద్రాచలంటౌన్: వివాహితను వేధిస్తున్న భర్తతోపాటు అతని కుటుంబ సభ్యులపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని ఏఎస్ఆర్ కాలనీకి చెందిన బొరిగళ్ల అరుణను ఆమె భర్తతోపాటు అత్తామామలు అదనపు కట్నం తేవాలని వేధింపులకు గురి చేస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి

ఖమ్మంక్రైం: రైలు ఢీకొనడంతో గుర్తుతెలియని మహిళ (55) మృతి చెందింది. జీఆర్పీ ఎస్ఐ భాస్కర్‌రావు తెలిపిన వివరాల మేరకు.. ఇద్దరు మహిళలు ఖమ్మంలోని నర్తకి థియేటర్ వద్ద పట్టాలు దాటుతుండగా వేగంగా వస్తున్న రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒక మహిళ మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. అయితే, రైలు వేగానికి మహిళ మృతదేహం సమీప కాల్వ లో పడడంతో పోలీసుల సూచన మేరకు అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు చేరుకుని మార్చురీకి తరలించారు. కాగా, మృతురాలు యూపీ లేదా బిహార్‌కు చెందిన వలస కూలీ అయి ఉండొచ్చని గాయపడిన మహిళ స్పృహలోకి వస్తే వివరాలు తెలుస్తాయని ఎస్ఐ వెల్లడించారు.

### పామాయిల్ గెలలు



| | |
|---|---|
| టన్ను ధర | రూ.12,623 |

# వీడని వరద



బూర్గంపాడు-భద్రాచలం రహదారిపై పులితేరు వద్ద భారీగా చేరిన వరదనీరు

- జలదిగ్బంధంలోనే గోదావరి పరీవాహక గ్రామాలు
- వేలాది ఎకరాల్లో నీటమునిగిన పంటలు
- రహదారులపై వరద పెరిగి నిలిచిన రాకపోకలు

బూర్గంపాడు: రెండురోజులుగా వర్షాలు తగ్గినా గోదావరి వరద మాత్రం ఇంకా వణికిస్తూనే ఉంది. భద్రాచలం వద్ద గురువారం నుంచి పెరుగుతున్న వరద శనివారం సాయంత్రం వరకూ శాంతించలేదు. శుక్రవారం అంత వేగంగా కాకుండా స్వల్పంగా పెరుగుతుండగా, శనివారం సాయంత్రం నది నీటిమట్టం 56 అడుగులకు చేరింది. ఎగువ నుంచి వరద ప్రవాహం తగ్గుతుందనే సమాచారంతో శనివారం అర్ధరాత్రికి ఒకింత శాంతించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. బూర్గంపాడు-నాగినేనిప్రోలు, నాగినేనిప్రోలు-సారపాకల మధ్య మూడుచోట్ల రాష్ట్రీయ రహదారిపైకి వరదనీరు చేరి రెండురోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి.



నాగినేనిప్రోలు పునరావాస కేంద్రంలో భోజనం చేస్తున్న మహిళలు

ఇరవెండి గ్రామం వద్ద కూడా వరద నీరు రహదారిపైకి చేరటంతో ఆ మార్గంలో కూడా రాకపోకలు నిలిచాయి. గోదావరి వరదలకు బూర్గంపాడులో 350 కుటుంబాలను, నాగినేనిప్రోలులో 90 కుటుంబాలను, సారపాకలో 400 కుటుంబాలను, మోతెలో 40 కుటుంబాలను, ఇరవెండిలో 60 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. బాధితులకు పునరావాస కేంద్రాలలో భోజనం, అల్పాహారం, పాలు, బిస్కెట్లు అందిస్తున్నారు. అన్ని పునరావాస కేంద్రాలలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి సేవలను అందిస్తున్నారు.

### నీట మునిగిన పంటలు, మోటార్లు

గోదావరి వరదలకు బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పినపాక, చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో వేలాది ఎకరాలలో పంటలు నీటమునిగాయి. సుమారు 1700 ఎకరాల్లో పత్తి, 300 ఎకరాల్లో వరి, 200 ఎకరాల్లో కూరగాయలు, 200 ఎకరాల్లో అపరాలు, వరినార్లు నీటమునిగాయి. శనివారం సాయంత్రం కూడా వరద ప్రవాహం పెరుగుతుండటంతో మరింత విస్తీర్ణంలో పంటలు నీటమునిగే అవకాశాలున్నాయి. గోదావరి వరదలకు వ్యవసాయ విద్యుత్ మోటార్లు, స్టార్టర్లు జలమయంగా మారాయి. కొన్నిచోట్ల రైతుల వ్యవసాయ పనిముట్లు కూడా వరదలోనే మునిగిపోయాయి. నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్న వరినార్లు గోదావరి వరదకు మునిగిపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది వరదల అనుభవంతో ఈ ఏడాది గోదావరి పరీవాహక ప్రాంతాల్లో పంటల సాగు ఒకింత తక్కువగానే చేపట్టారు. దీంతో పంటనష్టం గతేడాదితో పోల్చితే తగ్గింది. గోదావరి వరదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న అధికారులు ముంపు ప్రాంతాల ప్రజలను ముందస్తుగానే పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. బాధితులు కూడా తక్షణమే పునరావాస కేంద్రాలకు వెళ్లేందుకు సంసిద్ధులవుతున్నారు. ఇప్పటికే మూడురోజులుగా గోదావరి వరదలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు ఆదివారం గోదావరి తగ్గుముఖం పడుతుందనే ఆశతో ఉన్నారు.



బూర్గంపాడు వద్ద నీటమునిగిన పంటచేలు

# బాధితులకు ప్రభుత్వం అండ



బూర్గంపాడు వద్ద గోదావరి వరదను పరిశీలిస్తున్న ఎంపీలు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ తదితరులు

**బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత నామా, ఎంపీలు కవిత, వద్దిరాజు**

బూర్గంపాడు: వరద బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత నామా నాగేశ్వరరావు, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యురాలు మాలోత్ కవిత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర భరోసానిచ్చారు. బూర్గంపాడు, సారపాకలలోని వరదముంపు ప్రాంతాల్లో వారు ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌తో కలిసి పర్యటించారు. బూర్గంపాడు కస్తూర్బా పాఠశాలలోని పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడి వసతులపై ఆరా తీశారు. వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముంపు ప్రాంతాల ప్రజలు ముందస్తుగానే పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు. కేంద్రాల్లో నాణ్యమైన భోజనం, అల్పాహారం అందించాలని అధికారులకు సూచించారు. ముంపు ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. ఎన్డీఆర్ఎఫ్, రెస్క్యూ టీమ్‌లను అలర్ట్ చేసి అత్యవసర సమయాలలో వినియోగించుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సాయమందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెండు హెలికాప్టర్లను కూడా సిద్ధంగా ఉంచిందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, సర్పంచ్ సిరిపురపు స్వప్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, ప్రధాన కార్యదర్శి జక్కం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు రాయిగూడేనికి అధికారాలు



ట్రాక్టర్‌లో రాయిగూడెం వెళ్తున్న అధికారులు



గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

**పత్రికల్లో కథనాలతో కదలిక**

గుండాల: ఎట్టకేలకు అధికారులు ఆళ్లపల్లి మండలం రాయిగూడెం గ్రామాన్ని శనివారం సందర్శించారు. శుక్రవారం మద్యం దుకాణాల ఏర్పాటు తీర్మానం కోసం అధికారులు రాగా గ్రామస్తులు అడ్డుకున్న విషయం విదితమే. వరదల్లో చిక్కుకుంటే సాయమందించేందుకు ఎవరూ రాలేదని, మద్యం దుకాణాల కోసం మాత్రం వచ్చారా? అంటూ స్థానికులు నిలదీయడంతో, పత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. దీంతో ఆళ్లపల్లి మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సాధియా సుల్తానా, ఎంపీడీఓ రామారావు, పంచాయతీ పాలకవర్గం, రెవెన్యూ, వైద్యసిబ్బంది తదితరులు ట్రాక్టర్‌లో రాయిగూడెం గ్రామానికి చేరుకున్నారు. వరదసహాయక చర్యలతోపాటు వైద్యం, పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కాగా సమస్యల పరిష్కారానికి సహకరించిన ఆళ్లపల్లి ఎంపీపీ కొండ్రు మంజుభార్గవి, పత్రికా విలేకరులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

### బియ్యం స్వాధీనం

ములకలపల్లి: అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మూకమామిడి శివారులో పట్టుకుని ఆటోను సీజ్ చేసి, క్వింటా బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని సివిల్ సప్లయీస్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.



# వరద బాధితులకు ఎంపీ కవిత పరామర్శ

ఇల్లెందు: భారీ వర్షాలు, వరదలతో ఇళ్లు, గోడలు కూలిన బాధితులను మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత శనివారం పరామర్శించారు. బాధితలకు సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరదల వల్ల ప్రాణనష్టం జరగకుండా ముందస్తు నివారణ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నప్పటికీ వరద కష్టాల్లో ఉన్న తన నియోజకవర్గ ప్రజలను ఓదార్చేందుకు ఢిల్లీ నుంచి వచ్చినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ రోజు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అత్యవసర సేవలు అవసరమైనవారిని హెలికాప్టర్ల ద్వారా సురక్షిత ప్రాంతాలకు చేర్చుతున్నట్లు తెలిపారు. జిల్లా అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు పార్టీ శ్రేణులు అండగా ఉండాలని సూచించారు. అనంతరం 2వ వార్డులోని తాగునీటి చెరువు అలుగు ప్రాంతాన్ని సందర్శించి, స్థానిక కౌన్సిలర్ కటకం పద్మావతితో కలిసి పూజలు చేశారు. కాగా తనకు దళితబంధు ఇప్పించాలని ఇల్లెందులపాడుకు చెందిన చింతలచెరువు ధనమ్మ అనే మహిళ ఎంపీ కాళ్ల మీద పడింది. భర్త లేడని, ఇద్దరు పిల్లలతో జీవిస్తున్నానని, పార్టీలో పని చేసిన వారికే దళితబంధు ఇస్తారంటా అంటూ ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో ఎంపీ స్పందిస్తూ ఆమె వివరాలను తనకు పంపించాలని స్థానిక నాయకులకు సూచించారు. ఈ దఫా ఒక్కో నియోజకవర్గంలో 500 మందికి దళితబంధు వర్తింపచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగాల రాజేందర్, రైతుబంధు జిల్లా సభ్యులు పులిగళ్ల మాధవరావు, బీఆర్ఎస్ నాయకులు పరుచూరి వెంకటేశ్వరరావు, ఎస్. రంగనాథ్, మెరుగు కార్తీక్ యాదవ్, తహసీల్దార్ కృష్ణవేణి, కమిషనర్ కుమారస్వామి, మేనేజర్ అంకుషావళి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



దెబ్బతిన్న గోడను పరిశీలిస్తున్న ఎంపీ కవిత తదితరులు

# లారీని ఢీకొని యువకుడు మృతి

పాల్వంచరూరల్: ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకుడు రహదారి పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొని అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన కేశవాపురం వద్ద శనివారం జరిగింది. ఎస్ఐ కార్తీక్ కథనం ప్రకారం.. ఏపీ రాష్ట్రంలోని సీలేరుకు చెందిన చల్లాని జగదీష్(23) శుక్రవారం ఖమ్మం కోర్టుకు వెళ్లి శనివారం 3 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో కేశవాపురం వద్ద హైవే మీద నిలిపి ఉన్న లారీని ఢీకొట్టాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ప్రమాద దృశ్యం

### యువకుడి ఆత్మహత్య

పాల్వంచరూరల్: తండ్రి మృతి చెందడంతో మనోవేదనకు గురై ఓ యువకుడు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లిలో నివాసం ఉంటున్న బిటెక్ చదివిన సిరాజ్‌పాషా(28) శనివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి సుల్తానా బేగం జగన్నాథపురంలో ఉంటున్న మరో కుమారుడి ఇంటివెళ్లి వచ్చేసరికి మృతి చెంది ఉన్నాడు. 8 నెలల క్రితం తండ్రి గుండెపోటుతో మృతి చెందాడని, అప్పటి నుంచి సిరాజ్ మనోవేదన చెందుతున్నాడని కుటుంబీకులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ.కార్తీక్ తెలిపారు.

### కిన్నెరసానిలో వ్యక్తి గల్లంతు

గుండాల: ఆళ్లపల్లి మండలం ముత్తాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కిన్నెరసాని నదిలో గల్లంతయ్యాడు. బంధువుల ఇంట్లో దిశదినకర్మలు ఉండగా ముత్తాపురం గ్రామానికి చెందిన చాట్ల బుచ్చయ్య శనివారం జిన్నెలగూడెంలో కిన్నెరసాని నది దాటి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో మరో ఇద్దరితో కలిసి వస్తున్నాడు. నది దాటే క్రమంలో వరద తీవ్రతకు కొట్టుకుపోయాడు. అతనితో వచ్చిన వ్యక్తుల సమాచారంతో కుటుంబీకులు, గ్రామస్తులు గాలింపు చేపట్టారు. ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆర్డీఓ శిరీష, డీఎస్పీ రమణమూర్తి, ఎంపీపీ మంజుభార్గవి, ఎంపీడీఓ రామారావు, తహసీల్దార్ సాదియా సుల్తానా, డాక్టర్ రేవంత్, సర్పంచ్ ఈశ్వరి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు.

### పూసుగుప్పలో మావోయిస్టుల బ్యానర్..



గ్రామశివారులో వెలిసిన బ్యానర్

చర్ల: మండలంలోని పూసుగుప్ప శివారు ప్రాంతంలో శనివారం మావోయిస్టు పార్టీ బ్యానర్ వెలిసింది. ఈ నెల 28 నుంచి వచ్చే నెల 3 వరకు మావోయిస్టు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహించాలని కోరుతూ పార్టీ చర్ల శబరి ఏరియా కమిటీ కోరింది. వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ ఇప్పటికే పార్టీ భద్రాద్రి కొత్తగూడెం అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ, చర్ల శబరి ఏరియా కమిటీ కోరుతూ లేఖలను విడుదల చేయగా తాజాగా బ్యానర్‌ను ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది.

# ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

**పలువురు మావోయిస్టులకు గాయాలు**

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా కిష్టారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం మావోయిస్టులు, డీఆర్జీ బలగాల నడుమ ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఐదుగురి నుంచి ఆరుగురు మావోయిస్టులు గాయపడినట్లు సమాచారం. మావోయిస్టు కిష్టారం ఏరియా కమిటీ ఇన్‌చార్జ్ డీవీసీఎం రాజు, ప్లాటూన్ ఇన్‌చార్జ్ మాసాతో పాటు 30మందికి పైగా మావోలు ఛోటే కెడ్వాల్, బడే కెడ్వాల్, సంఘనమడ్గు అటవీప్రాంతంలో సంచరిస్తున్నట్లు అందిన సమాచారంతో డీఆర్జీ బలగాలు, యాంటీ నక్సల్స్ ఆపరేషన్ కోబ్రా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈక్రమంలో ఛోటేకెడ్వాల్ అటవీ ప్రాంతంలోకి భద్రతా బలగాలు ప్రవేశిస్తుండగా మావోయిస్టులు కాల్పులకు దిగారు. దీంతో భద్రతా బలగాలు సైతం ఎదురుకాల్పులు జరపడంతో మావోయిస్టులు దట్టమైన అడవిలోకి పారిపోయారు. కాగా, కాల్పుల్లో ఐదుగురి నుంచి ఆరుగురు మావోయిస్టులు గాయపడినట్లు సమాచారం ఉందని సుకుమా ఎస్పీ కిరణ్‌చవాన్ వెల్లడించారు.



చెల్లాచెదురుగా పడిఉన్న మావోయిస్టుల సామగ్రి

### గెట్టు పంచాయతీలో కొడవలితో దాడి

కారేపల్లి: చేను గెట్ల విషయమై జరిగిన ఘర్షణలో కొడవలితో దాడి చేయగా ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని పోలంపల్లికి చెందిన భూక్యా భద్రుకు ఊరు చివర వరి పొలం ఉంది. కాగా, భాగ్యనగర్‌తండా గ్రామానికి చెందిన ధా రావత్ హనుమ, ధరావత్ నాను పొలాలు భద్రు పొలం పక్కనే ఉండగా, గెట్టు విషయంలో హను మ, నానులు భద్రుతో ఘర్షణపడ్డారు. ఈక్రమంలో కొడవలితో భద్రుపై దాడిచేసి తీవ్రంగా గా యపర్చగా బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.రామారావు తెలిపారు.

# రెండు బుల్లెట్ వాహనాలు అపహరణ

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురం గ్రామంలో శుక్రవారం రాత్రి రెండు బుల్లెట్ వాహనాలను అపహరించారు. బాధితుల కథనం ప్రకారం.. తన ఇల్లు రిమోడలింగ్ పనులు జరుగుతుండటంతో పడమటనర్సాపురం గ్రామానికి చెందిన లేళ్ల గోపాల్‌రెడ్డి ఐదు రోజులుగా ఎదురుగా ఉన్న ఇంటి ముందు రేకుల షెడ్‌లో వాహనాన్ని లాక్ వేసి ఉంచుతున్నాడు. అదే గ్రామానికి చెందిన వందనపు నాగేశ్వరరావు కూడా శుక్రవారం తన ఇంటి వరండాలో బుల్లెట్ వాహనానికి తాళం వేసి ఉంచాడు. వీరిద్దరి వాహనాలను గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి అపహరించారు. మణుగూరు పని మీద వెళ్లిన గోపాల్‌రెడ్డి అర్ధరాత్రి దాటాక 1.30 గంటల సమయంలో ఇంటికి వచ్చాడు. రేకుల షెడ్‌లో చూడగా తన ద్విచక్రవాహనం కనిపించలేదు. శనివారం ఉదయం నాగేశ్వరరావు నిద్రలేచేసరికి ఆయన ఇంటి ముందు వరండాలో ఉంచిన బుల్లెట్ వాహనం కూడా కనిపించలేదు. బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా పోలీసులు అనుమానితులను అదుపులో తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.